క్లుప్తంగా

ఆర్గాన్ డొనేషన్ చైర్మన్‌కు సన్మానం



విజయ భాస్కర్‌రావును సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్గాన్ డోనేషన్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన మిట్టపల్లి విజయ భాస్కర్‌రావును బుధవారం పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్, రీజియన్–2 కపుల్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ సేవలను మరింత విస్తృత పరిచి మంచి గుర్తింపు తీసుకురావాలని క్లబ్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఐపీసీ మిర్యాల శత్రయ్య, డిస్ట్రిక్ట్ చైర్మన్ లకుమారపు పాండురంగయ్య, డిస్ట్రిక్ట్ ఇంచార్జి సామా శ్రీనివాస్, జోన్ చైర్మన్ రేపాల శ్రీనివాస్, చీదేళ్ల శ్రీనివాస్, పాంపాటి రామలింగయ్య, ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండా నాగరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు యాదగిరి, వనపర్తి శ్రీనివాస్, గందె రాము, కర్నాటి శరత్, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపంపిణీ బలోపేతం



రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యం

నిడమనూరు : కాంగ్రెస్ హయాంలోనే ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం అయిందని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని మార్తువారిగూడెం, మార్లగడ్డ క్యాంపులోని కొత్త రేషన్ దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణాలోనే సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. కొత్త రేషన్ దుకాణాలతో పక్క గ్రామాలకు వెళ్లి తీసుకువచ్చే ఇబ్బందులు స్థానికులకు తప్పనున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివ మారయ్య, అంకతి కృష్ణయ్య, మారుతి సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ : దేవరకొండ ప్రాంత ప్రయాణికులు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు కోరారు. బుధవారం దేవరకొండ డిపో నుంచి నాగర్‌కర్నూలు జిల్లా మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవస్థానానికి నూతనంగా ఏర్పాటు చేసిన సెమీ డీలక్స్ బస్సును ప్రారంభించి మాట్లాడారు. దేవరకొండ నుంచి ఉదయం 9గంటలకు బయలుదేరి డిండి, అచ్చంపేట మీదుగా మధ్యాహ్నం 12:45గంటలకు మద్దిమడుగు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 6గంటలకు గుంటూరు జిల్లా మాచర్లకు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 6:30గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 8:30 గంటలకు దేవరకొండకు చేరుకుంటుందన్నారు. ఈ బస్సు సర్వీసులో మహాలక్ష్మీ పథకం వర్తించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం సైదులు తదితరులున్నారు.

డీసీఎం ఓనర్స్ కార్యాలయం ప్రారంభం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణ పరిధిలోని చింతపల్లి బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని బుధవారం డీఎస్పీ కె.రాజశేఖరరాజు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ సోమనర్సయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు తెలుకుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలో పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ నాయకులు, కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందించాలని, పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

బియ్యం అందజేత

దేవరకొండ : పట్టణానికి చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఎండీ.ఖలీలొద్దీన్ జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థి జూలూరు శ్రీను బుధవారం పట్టణంలోని వృద్ధాశ్రమానికి 25కేజీల బియ్యం, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు చంద్రమౌళీ జయలక్ష్మీ, తదితరులున్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



పెద్దవూర : పీఏసీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు



మిర్యాలగూడ : పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు

పెద్దవూర : యూరియా కోసం రైతులు ఒకేరోజు రెండుసార్లు రోడ్డెక్కారు. ప్రస్తుతం యూరియా అవసరం ఎక్కువగా ఉండటంతో పీఏసీఎస్ వద్దకు పలు గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో వస్తున్నారు. రోజు ఒక లారీ యూరియానే వస్తుండటం, రైతుల సంఖ్య అధికంగా ఉండటంతో అందరికీ దొరకడం లేదు. దీంతో పలు గ్రామాల నుంచి రైతులు రాత్రి కూడా పీఏసీఎస్ ముందే పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం రాత్రి వర్షం వచ్చినా పీఏసీఎస్ ముందే పడుకున్న రైతులతో పాటు బుధవారం తెల్లవారకముందే రైతులు పీఏసీఎస్ వద్దకు వచ్చి ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకాల జిరాక్స్‌లను లైన్‌లో ఉంచారు. మంగళవారం క్యూలో ఉన్న 150 మంది రైతులకు టోకెన్లు ఇచ్చారు. ఉదయం పదకొండు గంటలైనా యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు కోదాడ – జడ్చర్ల హైవేపై గంటకు పైగా రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వై.ప్రసాద్ అక్కడికి చేరుకుని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడడంతో రాస్తారోకోను విరమించారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఒక లారీలో యూరియా వచ్చింది. చీకటి పడితే యూరియాను ఇవ్వడం ఇబ్బందిగా ఉంటుందని గురువారం ఇస్తామని అధికారులు చెప్పటంతో మరలా ఆగ్రహించిన రైతులు రెండోసారి రోడ్డెక్కారు. గంటకు పైగా రాస్తారోకో చేశారు. ఏఓ, ఎస్‌ఐలు వచ్చి రైతులతో నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకుండా అలాగే రోడ్డుపై బైఠాయించారు. మంగళ, బుధవారాలలో టోకెన్లు ఇచ్చిన రైతులకు గురువారం పంపిణీ చేస్తామని చెప్పటంతో విరమించుకున్నారు. తెల్లవారకముందే యూరియా కోసం వచ్చిన చాలా మంది రైతులు ఒక్క బస్తా కూడా రాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

యూరియా అందించలేని స్థితిలో ప్రభుత్వం

మిర్యాలగూడ : రైతులకు సరైన సమయంలో యూరియా అందించలేని దద్దమ్మ ప్రభుత్వం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఉందని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వందలాది మంది రైతులు బారులుదీరిన విషయం తెలుసుకున్న ఆయన అక్కడికి చేరుకుని రైతులనుద్దేశించి మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించాలన్నారు.

పీఏసీఎస్ ఎదుట పడిగాపులు

అదును దాటుతుంది యూరియా మాత్రం దక్కడం లేదంటూ బుధవారం రైతులు మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు చోట్ల ఆందోళన చేశారు. దామరచర్ల మండల కేంద్రంలో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై, మిర్యాలగూడ మండలం అవంతీపురంలో కోదాడ – జడ్చర్ల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మిర్యాలగూడలోని పట్టణంలోని పీఏసీఎస్ వద్ద తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో ఉన్నారు. రాస్తారోకో వద్దకు పోలీసులు చేరుకుని రైతులకు సర్దిచెప్పి పంపారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ వద్ద బుధవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. మండలానికి ఒక లారీ రావడంతో అధికారులు.. పోలీస్ బందోబస్త్ మధ్య రైతులకు ఒక్క పట్టాదారు పాస్ పుస్తకంపై రెండు యూరియా బస్తాల చొప్పున అందించారు.

త్రిపురారం : రైతులకు సకాలంలో యూరియా అందించాలని మండల కేంద్రంలో సాగర్ రోడ్డుపై ప్రధాన సెంటర్ లో బుధవారం రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. సమాచారం తెలుసుకున్న త్రిపురారం ఎస్‌ఐ గైకూరి నరేష్ రాస్తారోకో వద్దకు చేరుకొని రైతులకు సర్దిచెప్పి విరమింపజేశారు. అనంతరం పీఏసీఎస్ వద్ద రైతులకు ఆధార్ కార్డుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

బారులుదీరిన రైతులు

నిడమనూరు : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నిడమనూరు సహకార సంఘం వద్దకు బుధవారం పెద్ద సంఖ్యలో రైతులు యూరియాకోసం వచ్చారు. ఉదయం 7గంటలకే దాదాపు 600 మంది కొత్త రైతులు వచ్చారు.



అడవిదేవులపల్లిలో

కూపన్లు పొందిన రైతులు 340 మంది రైతులు వచ్చారు. ప్రధాన ద్వారం మూసివేయడంతో క్యూలైను కోసం గేటు దూకి సొసైటీలోకి ప్రవేశించారు. దీంతో సహకార ఉద్యోగులు పక్కనే ఉన్న బస్టాండు వద్ద కొత్త వారికి కూపన్లు పంపిణీ చేసి, రద్దీ తగ్గించారు. అన్నంతరం కొత్త రైతులకు కూపన్లు పంపిణీ చేశారు. సోమవారం వేలిముద్ర తీసుకొని కూపన్లు జారీ చేసిన రైతులకు బుధవారం మధ్యాహ్నం 20టన్నుల యూరియా లారీ 444 45కేజీల)బస్తాలు రాగా, ఒక్కో రైతుకు 2బస్తాల యూరియా చొప్పున 222 మంది రైతులకు పంపిణీ చేశారు. గురువారం రెండు లారీలు 40 టన్నుల యూరియా రానున్నట్లు అధికారులు చెప్పి కూపన్లు పంపిణీ చేశారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

గుర్రంపోడు : యూరియా కొరతపై బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో రైతులు నల్లగొండ– దేవరకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు మాట్లాడారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎస్‌ఐ మధు నాయకులను చెదరకొట్టి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పామనగుండ్ల వెంకన్న, మండల పార్టీ నాయకులు కూనూరి సైదిరెడ్డి, వేముల యాదయ్య, షేక్ సిరాజ్, చంటి, పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పాటుపడుతున్నాం

• సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



రేషన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన నూతన రేషన్ షాపును ప్రారంభించి మాట్లాడారు. పేదల కడుపునింపడం కోసం తమ ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకంతో తమ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నప్పటికీ తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నామని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రజాప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల మరమ్మతుల పనులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. అంతకుముందు మండల కేంద్రంలోని ప్రాధాన సెంటర్‌లో ఉన్న గణనాథుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోడుమడ గ్రామంలో పాముకాటుతో మృతిచెందిన బూడిద ధనమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేసి ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తహసీల్దార్ అనిల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, శాగం నాగిరెడ్డి, పిట్టల కృష్ణా, నాసర్‌రెడ్డి, నాగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

• ఎస్పీ శరత్ చంద్రపవార్



అజ్మాపురం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

దేవరకొండ : గణేశ్ శోభాయాత్ర నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించి మాట్లాడారు. నిమజ్జన ప్రాంతంలో బారికేడ్ల ఏర్పాటు, లైటింగ్, పారిశుద్ధ్య పనులు, తాగునీరు వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. చెరువు వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక ఉన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించి శాంతియుత వాతావరణలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏపల్లి మండలంలో ఏకేబీఆర్, పుట్టంగండి సిస్టర్న్, లింక్ కెనాల్‌లలో గణేశ్ నిమజ్జనం నిషేధిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అజ్మాపురం పుష్కరఘాట్ వద్ద, ఘణపురం సమీపంలోని బిడ్జి వద్ద నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక, కొండమల్లేపల్లి సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ నర్సింహులు సిబ్బంది తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామ శివారులోని దుందుబి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్‌లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్‌కుతరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజావాణి'

• ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్

మిర్యాలగూడ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి సత్వరమే సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. అధికారులు దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కొండ్రపోల్ గ్రామంలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు ఆయన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

మిర్యాలగూడ : పట్టణంలోని తాళ్లగడ్డ మూడో వార్డులో అన్యాక్రాంతమైన సీలింగ్ భూమిని, ఇందిరమ్మ కాలనీకి ఆనుకొని ఉన్న చిన్న చెరువు స్థలాన్ని, ఇందిరమ్మ కాలనీ కోసం కేటాయించిన వాటర్ ట్యాంక్ స్థలాన్ని అధికారులు విచారణ చేసి తిరిగి స్వాదీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త చిలుముల కొండలు కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. ఇందిరమ్మ కాలనీ కోసం కేటాయించిన సర్వే నెం.60, 61ఎలో 3.04గుంటల ప్రభుత్వ భూమిని అట్టి సర్వే నంబర్‌లోని రైతుల దగ్గర నుంచి డబ్బులు చెల్లించి నాటి అధికారులు 2009లో స్వాధీనం చేసుకొని ఇందిరమ్మ కాలనీ కోసం కేటాయించారన్నారు. అలా మిగిలిన ఉన్న కొంత భూమిని కొందరు అక్రమార్కులు అమాయక ప్రజలను నమ్మించి మోసం చేసి ఒక గుంట స్థలానికి రూ.6లక్షల నుంచి రూ.8లక్షల వరకు భూమిని అమ్మారన్నారు. ఈ విషయమై గతంలో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్డీఓ, తహసీల్దార్ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి వాటిలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించినట్లు తెలిపారు. అధికారుల బదిలీలు జరగగా ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కులు తిరిగి యథేచ్చగా భూముల అమ్మకాలు, అక్రమ కట్టడాలు చేపట్టి డోర్ నంబర్లు తీసుకొని కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మరల స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో సబ్ కలెక్టర్ ఇటీవల అధికారులతో కలిసి పరిశీలించి బోర్డులను ఏర్పాటు చేయగా ఆ బోర్డులను అక్రమార్కులు తిరిగి తొలగించి అక్రమ కట్టడాలను చేపట్టగా వారిపై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు.

క్రీడల్లో రాణిస్తే విద్య, ఉపాధి అవకాశాలు



నిడమనూరు : విద్యార్థులతో ఆటలాడుతున్న తహసీల్దారు, ఎస్‌ఐ ఉప్పు సురేష్.



తిరుమలగిరి(నాగార్జునసాగర్): సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

నిడమనూరు : క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు పొందవచ్చని తహసీల్దారు జంగాల కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం నిడమనూరు జిల్లా ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలని కోరారు. తహసీల్దారు, చైర్మన్, ఎస్‌ఐ ఉప్పు సరేష్ విద్యార్థులతో కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్ వెంకన్న, ఎస్‌ఐ ఉప్పు సురేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం డి. గౌతమ్, పీడీ లు నాగమణి, లచ్చయ్య, ఎండీ షరీఫ్, పీఈటీలు గిరి, నాగమణి, ఉపాధ్యాయులు రెబ్బ శ్రీనివాస్, రవీందర్, కంచి సైదయ్య, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వేములపల్లి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, సత్యనారాయణ, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేయాలని మండల విద్యాధికారి కొనమంచిలి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల నియోజకవర్గ కన్వీనర్ సత్యనారాయణ, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు కోడిమూరు వెంకట్రాంరెడ్డి, శోభారాణి, నారాయణరెడ్డి, యుగేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

డిండి : మండలంలో ప్రభుత్వపాఠశాలల్లోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ గోప్యానాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్14, 17 విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడల్లో ప్రతిభ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయన వెంట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి. పీఈటీలు తదితరులున్నారు.

కాంగ్రెస్ పాలనతోనే గ్రామాల అభివృద్ధి

• ఎమ్మెల్యే బాలునాయక్



చందంపేట : నేరెడుగొమ్ములో జనహిత కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : కాంగ్రెస్ పాలనతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం నేరెడుగొమ్ము మండల కేంద్రంలో మార్నింగ్ వాక్–జనహిత కార్యక్రమంలో భాగంగా పలు వార్డుల్లో కాలినడకన వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచుల పదవీకాలం ముగిసినందున పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్వే నెం.630లో భూములున్న రైతులు ఎమ్మెల్యేను కలిసి తన భూముల వివరాలను ఆన్‌లైన్ నుంచి తొలగించారని పేర్కొనగా స్పందించిన ఎమ్మెల్యే ఫోన్ ద్వారా జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. గ్రామంలో డ్రైయినేజీ సమస్య పరిష్కరించాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు తన కుమారులకు ఇల్లు లేందని చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య, ముక్కమల వెంకటయ్యగౌడ్, నాయిని మాధవరెడ్డి, బిక్కునాయక్, బసవారెడ్డి, గడ్డం వెంకటయ్య, పాపానాయక్, కొర్రరాంసింగ్, ఎస్‌కె.పాషా, సురేందర్‌రెడ్డి, వాంకుడావత్ రమేష్, తహశీల్దార్ ఉమాదేవి, వాణి, పీఆర్ఏఈ రాజునాయక్, ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ఆయా వార్డుల్లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పట్టణంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అములు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇప్పటికే ప్రజా సమస్యల పరిష్కారానికి నియోజకవర్గంలో జనహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొంౘ్ర శ్రీశైలంయాదవ్, హన్మంతు వెంకటేష్‌గౌడ్,పున్న వెంకటేశ్వర్లు, వెంకటయ్యగౌడ్, రాంసింగ్, అధికారులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



లీడర్లను అభినందిస్తున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : విద్యార్థులు పాఠశాల దశనుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. బుధవారం మండలంలోని సెయింట్ థామస్ పాఠశాలలో పాఠశాల కమిటీ ఎన్నికల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, నేటి బాలలే రేపటి బావిభారత పౌరులు అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో స్కూల్ పార్లమెంటరీ లీడర్‌గా ఏడో తరగతికి చెందిన బన్నీ, హెడ్ బాయ్‌గా తన్వీష్, హెచ్ ఎంగా జాహ్నవి, ప్రధాన కార్యదర్శిగా దివ్య, స్పోర్ట్స్ క్లబ్ లీడర్‌గా బి.అంజలి, కల్చరల్ క్లబ్ లీడర్‌గా సీహెచ్ మమత, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ క్లబ్ లీడర్‌గా పి.గాయత్రిలు ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్టిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపయ్యకు పూజలు



మిర్యాలగూడ అర్బన్ : డాక్టర్స్ కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ అర్బన్ : వినాయక చవితిని పురస్కరించుకొని మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నెలకొల్పిన వినాయక మండపంలో ప్రతిష్ఠించిన గణపయ్యకు బుధవారం డాక్టర్ శేఖర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి గోవర్ధన్ మాట్లాడుతూ.. గురువారం అన్నదాన కార్యక్రమం, లడ్డూ వేలం తర్వాత వినాయకుడి శోభాయాత్ర, నిమజ్జనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అంజయ్య, నాగేశ్వర్‌రావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని అవంతిపురం గుట్టపై కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో గల శ్రీవరసిద్ధి వినాయక ఆలయంలో ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు రాధాకృష్ణ వేదమంత్రోత్సవాల మధ్య తహసీల్దార్ సురేష్‌కుమార్, రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య, ఆర్‌ఐ ఠాగూర్ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి గాయత్రి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గుమ్మడెల్లి చిన సోమయ్య దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోలిశెట్టి వీరయ్య, లింగంపల్లి రవి, నాగటి సుధీర్‌బాబు, లింగంపల్లి లక్ష్మణ్, గుమ్మడెల్లి భరత్, కుర్ర రామస్వామి, రహీం, చిట్యాల సైదులు, శ్రీను, సాగర్, కిశోర్, మురళి, అరవింద్, అభిలాష్, సాయిరాజు, లక్ష్మయ్య, అనిల్, మధర్, సోమయ్య, ఉప్పుతల్ల మహేష్ ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన రిటైర్డు తహసీల్దార్ దైద నాగయ్య చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన సామాజిక సాంస్కృతిక సేవా సమితి ఇటీవల హైదరాబాద్‌లో అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మిర్యాలగూడ ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో దైద నాగయ్యను ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చినపంగు గోపయ్య, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, సూపరింటెండెంట్‌కోడిరెక్క మట్టయ్య, పీడీ ఎడ్వీన్, మంగయ్య, వెంకులు, నగేష్, ప్రేమ్‌కుమార్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డికి నివాళి

మాడుగులపల్లి : మండలంలోని చెరువుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం సుధాకర్‌రెడ్డి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకొని సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన సానుభూతి వ్యక్తం చేశారు. సుధాకర్‌రెడ్డి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ సూదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కందిమళ్ల నరేందర్‌రెడ్డి, వెన్న శ్రవణ్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మేకల అరవింద్‌రెడ్డి, బొర్రాజు సైదులు, సైదిరెడ్డి, పుల్లెంల ఏడుకొండలు, గుర్రం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.